సాక్షి
ఆదిలాబాద్
శనివారం । 11 । అక్టోబర్ । 2025



మహిళలు.. మహారాణులు!
పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. 8లో▸



బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
జిల్లాలో బతుకమ్మ సంబరాలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని పలు కాలనీల్లో మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.0/21.0
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం చాలా వరకు ఎండగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

13న యథావిధిగా ప్రజావాణి

కైలాస్‌నగర్: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 13 నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. ఇదివరకు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రీవెన్స్‌ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. విషయాన్ని జిల్లావాసులు గమనించాలని సూచించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్

ఉట్నూర్‌రూరల్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. మాతా శిశు మరణాలు, ఇతర అంశాలపై వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో జిల్లా అదనపు వైద్యాధికారి కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాతా శిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణుల వివరాలు నమోదు చేసి సమయానుసారం వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించాలన్నారు. అనంతరం మండలంలోని శ్యాంపూర్, దంతన్‌పల్లి పీహెచ్‌సీలను సందర్శించారు. వారి వెంట అదనపు డీఎంహెచ్‌వో మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, క్షయ నివారణ అధికారి సుమలత, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తోషం సబ్‌సెంటర్ తనిఖీ
గుడిహత్నూర్: మండలంలోని తోషం సబ్‌సెంటర్‌ను డీఎంహెచ్‌వో శుక్రవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణులకు అవసరమైన సలహాలు అందిస్తూ పీహెచ్‌సీలో ప్రసవం అయ్యేలా చూడాలన్నారు. వారి వెంట హెల్త్ అసిస్టెంట్ ఎజాజ్, ఏఎన్‌ఎంలు సునీత, తుర్పాబాయి, ఆశవర్కర్ రేణుక ఉన్నారు.

మరో మూడు 'మద్యం' దరఖాస్తులు



దరఖాస్తు సమర్పిస్తున్న టెండర్‌దారు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో మద్యం షాపులకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుంది. ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో శుక్రవారం టెండర్‌దారులు మూడు దరఖాస్తులు సమర్పించారు. ఆదిలాబాద్ పట్టణంలోని 8, 10వ నంబర్ షాపులకు, ఉట్నూర్‌లోని ఒక షాపునకు దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 18, ఇచ్చోడ స్టేషన్ పరిధిలో 3, ఉట్నూర్ స్టేషన్ పరిధిలో ఒక దరఖాస్తు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి హిమశ్రీ, ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు.

పొగాకుతో ఆరోగ్యంపై ప్రభావం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీకాంత్

ఆదిలాబాద్‌టౌన్: పొగాకు సేవించడంతో ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని బాలక్‌మందిర్, ప్రభుత్వ నం.2 పాఠశాలల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొగాకు, మత్తుపదార్థాలతో క్యాన్సర్, ఇతర రోగాల బారిన పడతారని తెలిపారు. కోట్పా చట్టం ప్రకారం మైనర్లు పొగాకు ఉత్పత్తులు విక్రయించడం, కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నం.2 పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, పొగాకు నియంత్రణ విభాగం సోషల్ వర్కర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ముందడుగు పడినా..

- సీసీఐ పత్తి కొనుగోలులో వీడని ప్రతిష్టంభన
- మూడోసారి పిలిచిన టెండర్లలో పాల్గొన్న మిల్లర్లు
- నిబంధనల సడలింపు విషయంలో ఇంకా సందిగ్ధమే..
- 14 వరకు జిన్నింగ్ మిల్లులు ఖరారయ్యే అవకాశం
- ఆ తర్వాతే కొనుగోళ్ల తేదీపై నిర్ణయం..?



జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలు (ఫైల్)

జిల్లాలో సీసీఐ కేంద్రాలు..: 11
(ఆదిలాబాద్-ఏ, ఆదిలాబాద్-బి, ఇచ్చోడ, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, బేల, బోథ్-ఏ, పొచ్చర, నేరడిగొండ, సొనాల)

సాక్షి,ఆదిలాబాద్: సీసీఐ పత్తి కొనుగోళ్ల అంశంలో ముందడుగు పడినా ప్రతిష్టంభన మాత్రం వీడని పరిస్థితి. ప్రధానంగా భారత పత్తి సంస్థ జిన్నింగ్ మిల్లులను అద్దెకు తీసుకున్న తర్వాతే కొనుగోళ్ల అంశం ముందుకెళుతుంది. అయితే ఇప్పటివరకు ఇంకా మిల్లులు ఖరారు కాలేదు. సీసీఐ పిలిచిన మొదటి రెండు టెండర్లకు దూరంగా ఉన్న మిల్లర్లు మూడోసారి మాత్రం పాల్గొన్నారు. కొనుగోళ్ల పరంగా ఒక అడుగు ముందుకు పడినప్పటికీ.. మిల్లర్లు డిమాండ్ చేసిన విధంగా ఆయా అంశాల్లో సీసీఐ సడలింపులు ఇవ్వలేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లతో చర్చించిన తర్వాత వారు ఈ టెండర్లలో పాల్గొన్నారు. ఈనెల 14 వరకు మిల్లులు ఖరారయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాతే కొనుగోళ్లకు సంబంధించి తేదీ నిర్ణయించేందుకు వీలుంటుంది.

ఈ ఏడాది పరిస్థితి..
సాధారణంగా దసరా వరకే పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తవుతాయి. ప్రధానంగా సీసీఐ జిన్నింగ్ మిల్లులను అద్దెకు తీసుకొని కొనుగోళ్లకు సిద్ధమవుతుంది. అయితే ఈసారి యజమానులు ఇప్పటివరకు రెండు సార్లు టెండర్లను బహిష్కరించడంతో ప్రతిష్టంభన కొనసాగింది. ఎట్టకేలకు రాష్ట్ర వ్యాప్తంగా మూడోసారి పిలిచిన టెండర్లలో మిల్లర్లు పాల్గొనడంతో దాదాపుగా తొలిగినట్టేనని అంటున్నప్పటికీ ప్రధాన డిమాండ్ల విషయంలో ఇంకా తకరారు కొనసాగుతుంది. మిల్లుల ఖరారు తర్వాతే కొనుగోళ్ల తేది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

పలు అంశాలను విభేదిస్తున్న మిల్లర్లు..
సీసీఐ జిన్నింగ్ మిల్లులు అద్దెకు తీసుకునే విషయంలో టెండర్లలో 14 అంశాల ఆధారంగా నిబంధనలు రూపొందించింది. వీటిని యజమానులు విభేదిస్తున్నారు. అందులో ప్రధానంగా స్లాట్ బుకింగ్‌తో పాటు లింట్ (దూది శాతం)కు సంబంధించి ఇదివరకు కొనుగోళ్లు మొదలైన ప్రతినెలకోసారి శాతంలో మార్పు చేసేవారు. అయితే ఈసారి ప్రతి 15 రోజులకోసారి ఈ లింట్ శాతాన్ని మార్చేలా నిబంధనలు రూపొందించడాన్ని మిల్లర్లు వ్యతిరేకిస్తున్నారు. అంతేకాకుండా ఆయా జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోళ్లు చేసే అంశంలో గ్రేడింగ్ విధానాన్ని అమలు పర్చుతుండడంతో ఆ అంశంలోనూ విభేదిస్తున్నారు. నిబంధనలు రూపొందించిన అంశాల ఆధారంగా పాయింట్లు కేటాయించడం జరుగుతుంది. ఏ జిన్నింగ్ మిల్లుకు ఎక్కువ పాయింట్లు వస్తాయో దాన్ని బేరీజు వేసుకొని ఎల్-1, ఎల్-2 గ్రేడింగ్ ఇస్తారు. వాటి ఆధారంగానే కొనుగోళ్లు ఆయా జిన్నింగ్‌లలో చేపడతామనే నిబంధనను సీసీఐ రూపొందించగా, మిల్లర్లు దీన్ని సడలించాలని కోరుతున్నారు. ఇలా పలు అంశాల్లో విభేదాలు కొనసాగుతున్నప్పటికీ టెండర్లలోనైతే యజమానులు పాల్గొన్నారు. ఇక వాటి ఖరారు అయ్యేవరకు వీటి విషయంలో ఎలాంటి నిర్ణయం ఉంటుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

80 శాతం క్రాప్ బుకింగ్ పూర్తి



జిల్లాలో క్రాప్ బుకింగ్ 80 శాతం పూర్తయింది. 15వ తేదిలోగా మిగతాది పూర్తి చేస్తాం. ప్రధానంగా పత్తి కొనుగోళ్ల తేది నిర్ణయానికి ముందే ఈ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం.
– శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయ అధికారి, ఆదిలాబాద్

సీసీఐ కేంద్రాలు ఖరారు



సీసీఐ జిల్లాలో 11 కేంద్రాల ద్వారా పత్తిని కొనుగోలు చేయనుంది. దీనికి సంబంధించి ఆయా కేంద్రాల ఖరారు ఇప్పటికే పూర్తయింది. ఇక సీసీఐ జిన్నింగ్ మి ల్లులు అద్దెకు తీసుకునే విషయంలో మిల్లర్లు టెండర్లలో పాల్గొన్నారు. వాటిని త్వరలోనే తెరిచి ఆ మిల్లులను కూడా ఖరారు చేయడం జరుగుతుంది.
– గజానన్, జిల్లా మార్కెటింగ్ అధికారి

బేల్ ధర నిర్ణయించాల్సి ఉంది



జిన్నింగ్ మిల్లుల్లో పత్తి నుంచి దూది వేరుచేసిన తర్వాత బేళ్లు తయారు చేయడం జరుగుతుంది. గతేడాది ఒక బేల్ తయారీకి సీసీఐ జిన్నింగ్ మిల్లులకు రూ.1,350 ఇచ్చింది. ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా మేము రూ.1701 ధర కోట్ చేశాం. టెండర్లను తెరిచే ముందు సీసీఐ ఈ ధర ఖరారు విషయంలో యజమానులతో చర్చిస్తుంది. ఆ తర్వాత బేల్ తయారీ ధర నిర్ణయిస్తుంది.
– రాజు చింతవార్, పత్తి వ్యాపారి, ఆదిలాబాద్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- ఎస్పీ అఖిల్ మహాజన్



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఇంద్రవెల్లి: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఉట్నూర్ సబ్‌డివిజన్ పోలీసు అధికారులతో శుక్రవారం రాత్రి సమావేశమయ్యారు. పలు అంశాలపై వారికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో రౌడీలు, సస్పెక్ట్ రౌడీల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రతీ గ్రామంలో విలేజ్ పోలీస్ అధికారి కీలకంగా వ్యవహరించాలన్నారు. అలాగే జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, సీఐలు మడావి ప్రసాద్, ఎస్సై సాయన్న, కానిస్టేబుళ్లు ఉన్నారు.

ఒత్తిడికి గురికావద్దు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ జైసింగ్, జూడాలు

ఆదిలాబాద్‌టౌన్: ఒత్తిడికి గురైతే మానసిక ఆరోగ్యంతో బాధపడతారని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని రిమ్స్ డైరెక్టర్ చాంబర్‌లో తెలంగాణ జూనియర్ డాక్టర్లు మానసిక ఆరోగ్య హెల్ప్‌డెస్క్, పీర్ సపోర్ట్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మానసిక వైద్యనిపుణులు ఓంప్రకాశ్, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

విద్యాశాఖ అప్రతిష్టపాలు

- ☞ గత నెలలో నార్నూర్ కేజీబీవీలో విద్యార్థులకు పురుగుల భోజనం వడ్డించడంతో ఆ పాఠశాలలో పనిచేసే ప్రత్యేక అధికారిని విధుల నుంచి తొలగించారు. కాగా, రెండు రోజుల క్రితం కేజీబీవీలను పర్యవేక్షించే సెక్టోరియల్ అధికారిని సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.
- ☞ ఇంద్రవెల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ప్రధానోపాధ్యాయుడు నిధులు దుర్వినియోగం చేస్తున్నాడని అక్కడి ఉపాధ్యాయులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాగా, ఇదే పాఠశాలలో పనిచేసే ఓ ఉపాధ్యాయుడు పోక్సో కేసులో సస్పెండ్ కావడం గమనార్హం.
- ☞ పది రోజుల క్రితం జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన సమీక్షకు ఏడుగురు ఎంఈవోలు గైర్హాజరయ్యారు. ఈమేరకు ఆదిలాబాద్‌అర్బన్, గుడిహత్నూర్, మావల, బోథ్, నార్నూర్, గాదిగూడ, ఉట్నూర్ ఎంఈవోలకు డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు.
- ☞ దసరా సెలవులకు ముందు కలెక్టర్ ఆరోగ్య పాఠశాలపై సమీక్ష నిర్వహించారు. అయితే తమకు రాగిజావ ఇవ్వడం లేదని ఇచ్చోడ మండలానికి చెందిన ఓ పాఠశాల విద్యార్థి కలెక్టర్‌కు చెప్పడంతో సదరు ఎంఈవోకు నోటీసులు జారీ చేశారు.
- ☞ ఇటీవల జిల్లాలోని పలు పాఠశాలల్లో కొంత మంది ఉపాధ్యాయులు విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించారు. నలుగురిపై పోక్సో కేసులు నమోదై కటకటాల పాలయ్యారు.

- ఉద్యోగుల సస్పెన్షన్లు, సరెండర్లతో విమర్శలపాలు
- రెగ్యులర్ జిల్లా అధికారి లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యం
- గాడితప్పిన పాలన.. లోపించిన పర్యవేక్షణ



జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా విద్యాశాఖ ఇటీవల అప్రతిష్ట మూటగట్టుకుంటుంది. ఆ శాఖలో సస్పెన్షన్లు, సరెండర్లు, టర్మినేట్, మెమోల జారీ.. ఇలా వరుస ఘటనలు కారణమని చెప్పుకోవచ్చు. ప్రధానంగా పర్యవేక్షణ లోపమనే చర్చ సాగుతోంది. కొన్నేళ్లుగా జిల్లాకు రెగ్యులర్ విద్యాశాఖాధికారి కరువయ్యారు. దీంతో పలువురు ఉద్యోగులు, కొంత మంది ప్రధానోపాధ్యాయులు అక్రమాలకు తెర లేపుతున్నారు. పాఠశాలలో విద్యార్థులపై కొందరు గురువులు అసభ్యంగా ప్రవర్తిస్తూ కటకటాల పాలవుతున్నారు. పౌష్టికాహారం మాట పక్కనబెడితే.. కనీసం నాణ్యమైన విద్యాబోధన సైతం అందకుండా పోతుందనే విమర్శలున్నాయి.

అక్రమాల జోరు..
విద్యాశాఖలో ప్రతీ పనికి ఎంతో కొంత ముట్టజెబితే కానీ కొంత మంది ఉద్యోగులు ఫైళ్లు కదలనివ్వడం లేదని పలువురు చెబుతున్నారు. రెగ్యులర్ డీఈవో లేకపోవడం, ఇన్‌చార్జి అధికారి స్థానికంగా ఉండకపోవడంతో వారి ఆగడాలు మితిమీరుతున్నట్లు తెలుస్తోంది. కొంత మంది ప్రధానోపాధ్యాయులు సైతం పాఠశాల నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. విద్యాభివృద్ధి కోసం కేటాయించాల్సిన వాటిని సొంతగా వినియోగించుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గాడితప్పిన పాలన..
జిల్లాకు ఐదారేళ్లుగా రెగ్యులర్ విద్యాధికారి కరువయ్యారు. ఇటీవల ఇన్‌చార్జి అధికారి ఉద్యోగ విరమణతో వయోజన విద్యాశాఖ అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన పనితీరు సరిగా లేకపోవడంతో ఆయనను తప్పించారు. ఐటీడీఏ పీవోకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే సదరు అధికారికి కీలకమైన ఐటీడీఏ శాఖ ఉండడంతో పూర్తిస్థాయిలో జిల్లా విద్యాశాఖపై దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. దీంతో పాలన గడితప్పినట్లు తెలుస్తోంది. ఫేషియల్ అటెండెన్స్ ఉన్నప్పటికీ కొంత మంది సమయపాలన పాటించడం లేదు. కొందరు మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను పర్యవేక్షించాల్సి ఉండగా, కార్యాలయానికే పరిమితమవుతున్నారని తెలుస్తోంది. ఈ ప్రభావం విద్యార్థుల చదువుపై పడుతుంది. పదో తరగతికి సంబంధించి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యా శాఖాధికారులు గత మంగళవారం ఆదేశాలు జారీ చేస్తే కొన్ని పాఠశాలల్లో మాత్రమే ఈ తరగతులు నిర్వహిస్తున్నారు. అలాగే కేజీబీవీల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. మెనూలో కోత విధిస్తూ కొంత మంది ఎస్‌వోలు అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. ఇటీవల నాణ్యమైన భోజనం అందక విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన విషయం తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందడం లేదు. సర్కారు బడుల బాగు కోసం ప్రభుత్వం చర్యలు చేపడితే కొంత మంది ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయుల తీరుతో విద్యాశాఖకు చెడ్డపేరు వస్తోంది.
ఈ విషయమై విద్యా శాఖ ఏడీ వేణుగోపాల్ గౌడ్‌ను వివరణ కోరగా, ఇటీవల నార్నూర్ మండలంలోని కేజీబీవీలో జరిగిన సంఘటనపై సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారని తెలిపారు. అలాగే ఇంద్రవెల్లి ప్రధానోపాధ్యాయుడిని ఆర్‌జేడీకి కలెక్టర్ సరెండ్ చేసినట్లు వివరించారు.

ఇంద్రవెల్లి పీజీహెచ్‌ఎం సరెండర్

- నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ కొరడా



ఇంద్రవెల్లి హెచ్‌ఎంను ఆర్‌జేడీకి సరెండర్ చేసిన ఉత్తర్వు ప్రతి

ఆదిలాబాద్‌టౌన్: ఇంద్రవెల్లి పీజీహెచ్‌ఎం రాంమోహన్‌పై కలెక్టర్ కొరడా ఝళిపించారు. పాఠశాలలోని పీఎంశ్రీ నిధులకు సంబంధించి దుర్వినియోగంపై చర్యలు చేపట్టారు. ఇటీవల పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఉపాధ్యా య సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు ప్రధానోపాధ్యాయుడు పీఎంశ్రీ నిధులను దుర్వినియోగం చేశాడని, అలాగే పాఠశాలలో వాతావరణానికి భంగం కలిగిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు విచారణకు ఆదేశించిన కలెక్టర్ ఆయనను వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డికి సరెండర్ చేశారు. ఇదిలా ఉండగా ఇంద్రవెల్లి పాఠశాలలో పోక్సో కేసులో ఇటీవల సస్పెండ్ అయిన నాందేవ్ అనే ఉపాధ్యాయుడిని తిరిగి విధుల్లోకి తీసుకుంటూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈయనకు బోథ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విధులు కేటాయించారు.

కొనుగోళ్లు ఎప్పుడో..?



ఈ రైతు పేరు సాయినాథ్. బోథ్ మండలంలోని మర్లపెల్లి గ్రామం. ఈ సీజన్‌లో ఎనిమిదెకరాల్లో సోయా సాగు చేశాడు. అయితే అధిక వర్షాల కారణంగా ఆశించిన దిగుబడి రాలేదు. పంట కూడా ఆలస్యంగా చేతికొచ్చింది. మరోవైపు ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో పంటనంతా ఇంకా చేనులోనే ఉంచాడు. కొనుగోలు కేంద్రాల ప్రారంభం కోసం ఎదురు చూస్తున్నాడు. ఇతనొక్కడే కాదు.. జిల్లాలో చాలా మంది రైతులదీ ఇదే పరిస్థితి.

- చేతికొచ్చిన సోయా పంట
- మార్కెట్‌కు తెస్తున్న రైతులు
- ఇంకా తెరుచుకోని కేంద్రాలు
- ఆలస్యమైతే దళారుల రంగ ప్రవేశం
- ఇప్పటికే అధిక వర్షాలతో దిగుబడిపై ప్రభావం



బోథ్ వ్యవసాయ మార్కెట్‌లో ఆరబెట్టిన సోయా

జిల్లాలో

సోయా పంట సాగు	62,500 ఎకరాలు
మద్దతు ధర(క్వింటాలుకు)	రూ. 5,328

బోథ్: జిల్లాలో ఈ సీజన్‌లో సాగైన సోయా పంట చేతికొస్తోంది. అయితే కొనుగోలు కేంద్రాలు ఇంకా తెరుచుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల పంట దిగుబడులను మార్కెట్ యార్డులకు సైతం తరలించారు. అయితే కొనుగోళ్లపై అధికారుల నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో వారికి నిరీక్షణ తప్పడం లేదు.

మార్కెట్‌కు చేరుతున్న పంట..
పంట దిగుబడిని నిల్వ చేసుకోవడానికి చాలా మంది రైతులకు ఇళ్ల వద్ద వసతులు లేవు. మరోవైపు ఇటీవల కురిసిన అధిక వర్షాలతో తేమ శాతం పెరిగే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో దిగుబడిని త్వరగా విక్రయించాలని రైతులు భావిస్తున్నారు. చేతికొచ్చిన పంటను నేరుగా మార్కెట్‌కు తరలిస్తున్నారు. అయితే కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాకపోవడంతో యార్డుల్లోనే రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు.

తప్పని ఎదురుచూపులు..
ప్రభుత్వం సోయా క్వింటాలుకు రూ.5,328 మద్దతు ధర ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. దీంతో మార్కెట్ల వద్దే రైతులు పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు ప్రైవేట్ వ్యాపారులు, దళారులు రంగప్రవేశం చేసి క్వింటాలుకు రూ.4,500 చొప్పున కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. కేంద్రాలు త్వరగా తెరుచుకోకపోతే క్వింటాలుకు రూ.800 వరకు నష్టపోయే ప్రమాదముందని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆదేశాలు రాగానే కొనుగోళ్లు


సోయా కొనుగోళ్లకు సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కేంద్రాలను ప్రారంభించి తగు చర్యలు చేపడతాం. వారం, పది రోజుల్లో పట్టే అవకాశం ఉంది.
– ప్రవీణ్‌రెడ్డి, డీఎం, మార్క్‌ఫెడ్, ఆదిలాబాద్

త్వరగా ప్రారంభించాలి



సోయా పంట చేతికొచ్చింది. మార్కెట్‌కు కూడా తీసుకు వచ్చా. అయితే కొనుగోళ్లపై అధికారులు ఎలాంటి సమాధానం ఇవ్వడం లేదు. దీపావళి అయ్యాక కొంటామని కొందరు చెబుతున్నారు. అప్పటి వరకు మా పరిస్థితి ఏంటి. త్వరగా కేంద్రాలు ప్రారంభించి కొనుగోళ్లు చేపట్టాలి. – సింధె రాజారాం, రైతు, బోథ్

గోస పడుతున్నం..



ఇంటి వద్ద స్థలం లేక సోయా పంటను చేను నుంచి నేరుగా యార్డుకు తీసుకువచ్చా. ఇప్పటికి రెండు రోజులైంది. ఇక్కడ ఇంకా కొనుగోళ్లు మొదలు పెట్టలే. చానా గోస పడుతున్నం. వర్షాల కారణంగా తేమ శాతం కూడా పెరిగే అవకాశం ఉంది. త్వరగా కొనుగోళ్లు చేపట్టాలి.
– మహేందర్, రైతు, బోథ్

అడ్డుపడితే గుణపాఠం చెబుతాం

- బీసీ సంఘాల ఆందోళన



రహదారిపై బైఠాయించి నినాదాలు చేస్తున్న బీసీ సంఘం నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: బీసీలకు 42శాతం రిజర్వేషన్‌కు ఎవరు అడ్డుపడుతున్నారో తమకు తెలుసని, రాబోయే రోజుల్లో వారికి తగిన గుణపాఠం చెబుతామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు అన్నారు. బీసీ రిజర్వేషన్‌కు వ్యతిరేకిస్తూ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషనర్ల దిష్టిబొమ్మతో శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తెలంగాణ చౌక్ వద్ద దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇరువురి మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ మేరకు అసెంబ్లీలో జీవో చేసి గవర్నర్ వద్దకు పంపితే అక్కడ పెండింగ్‌లో ఉందన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్‌తో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే జీర్ణించుకోలేక కొందరు హైకోర్టులో కేసు వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వెనుక ఎవరున్నారో బీసీలకు తెలుసని, తగిన సమయంలో వారికి గుణపాఠం తప్పదన్నారు. రిజర్వేషన్ అమలయ్యే దాకా పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, నాయకులు అంజయ్ కుమార్, శ్రీనివాస్, అశోక్, రాము, చందు, సామల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

స.హ.చట్టంపై అవగాహన కల్పించాలి

కైలాస్‌నగర్: సమాచార హక్కు చట్టంపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించి ఆర్టీఐ చట్టం సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. ఈనెల 5 నుంచి 12 వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పెన్‌గంగ భవన్‌లోని అదనపు కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్టీఐ అవగాహనకు సంబంధించి పలు విషయాలను జిల్లా స్థాయి అధికారులతో చర్చించారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరి కుచ్చుల తయారీపై వీడియో చిత్రీకరణ



వరి కుచ్చులతో విజయలక్ష్మి, అధికారులు

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామ సమీపంలో శుక్రవారం వరి కుచ్చుల తయారీపై వీడియో చిత్రీకరించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఢిల్లీ నుంచి వచ్చిన పర్యాటక బృందం అధికారులు చిరాక్, మనీశ్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వరి కుచ్చుల తయారీపై ఫొటో, వీడియో చిత్రీకరించారు. డీఆర్డీవో ఢిల్లీ అధికారులతో కలిసి వరి కోసి కుచ్చులు తయారు చేశారు. లక్ష్మణచాంద, సోన్ ఐకేపీ ఏపీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

జైపూర్: మండలంలోని కిష్టాపూర్ గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కిష్టాపూర్ వద్ద గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఒక్క ట్రాక్టర్ షెట్‌పల్లి వద్ద, మరో రెండు ట్రాక్టర్లు నర్సింగాపూర్ వద్ద పట్టుబడగా వాటిని పోలీస్‌స్టేషన్ తరలించి యజమానులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోతి దాడిలో వృద్ధురాలికి గాయాలు



చికిత్స పొందుతున్న పూలమ్మ

ముథోల్: మండలంలోని నయాబాదీ కాలనీకి చెందిన పూలమ్మ అనే వృద్ధురాలు కోతి దాడిలో తీవ్రంగా గాయపడింది. వివరాలు.. శుక్రవారం పూలమ్మ తన ఇంటి నుంచి గోధుమలు, జొన్నలు తీసుకుని గిర్నికి వెళ్తుండగా కోతులు ఆమెపై దాడి చేశాయి. గోధుమలు, జొన్నలను చెల్లాచెదురు చేసి ఆమెపై దాడి చేయగా నడుము భాగంలో గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆమె కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఆమెను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన కుటుంబ సభ్యులు చికిత్స అందించారు.

కిరాణా షాపులో చోరీ

నెన్నెల: మండలంలోని మైలారం గ్రామంలో కొటారపు భీమన్నకు చెందిన కిరాణా షాపులో గురువారం రాత్రి చోరీ జరిగింది. భీమన్న షాపునకు తాళం వేసి మంచిర్యాల ఆస్పత్రికి వెళ్లాడు. గమనించిన దుండగులు తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. రూ.30వేల నగదు, రూ.7వేల విలువైన సామగ్రి ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఆస్పత్రి నుంచి వచ్చిన భీమన్న దుకాణంలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై ప్రసాద్ సిబ్బందితో ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

చెట్ల నరికివేతపై విచారణ

దండేపల్లి: మండలంలోని తానిమడుగు ప్రత్యేక బీట్‌లో దసరాకు ముందు చెట్లు నరికివేసినట్లు వీడియోలు వైరలయ్యాయి. దీనిపై అటవీ శాఖ అధికారులు తానిమడుగు బీట్‌లో రెండు రోజులు పర్యటించి పరిశీలించారు. 40చెట్లు నరికివేసినట్లు గుర్తించారు. వాటి విలువ రూ.2.80 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. కాగా, ఈ ఘటనలో కొంతమందిని అనుమానిస్తూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

వైకుంఠధామం గేటు చోరీ



కిష్టాపూర్ వైకుంఠ ధామం కమాన్

జన్నారం: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలోని వైకుంఠధామానికి చెందిన ఇనుప గేటును దొంగలు ఎత్తుకెళ్లిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన యువకులు ఈ విషయాన్ని గ్రామ వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేయడంతో విషయం బయటకు వచ్చింది. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి గోపీచంద్ నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అనూష వైకుంఠధామం పరిసర ప్రాంతాలను పరిశీలించి త్వరలో నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

మహిళలు.. మహారాణులు!

- స్వయం ఉపాధి వైపు అతివల చూపు
- తక్కువ వడ్డీ రుణాలతో వ్యాపారాలు
- పురుషులకు దీటుగా రాణిస్తున్న వైనం
- ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు..

తానూరు: మహిళలు పురుషులకు దీటుగా రాణిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. ఇంటిని చక్కదిద్దడమే కాదు.. కుటుంబ పోషణకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. విద్య, రాజకీయం, ఉద్యోగాలతో పాటు వ్యాపారంలోనూ రాణిస్తున్నారు. డ్వాక్రా సంఘంలో తక్కువ వడ్డీకి రుణాలు తీసుకుని కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే వివిధ వ్యాపారాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న కొందరు మహిళలపై కథనం..



గ్రామంలోనే వ్యాపారం చేస్తున్న

డ్వాక్రా సంఘంలో రూ.5లక్షలు రుణం తీసుకుని గ్రామంలోనే బట్టల షాపు, లేడీస్ టైలర్, ఎంబ్రాయిడరీ, మ్యాచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న. స్వయంగా దూరప్రాంతాలకు వెళ్లి కొత్త కొత్త నమూనాలు ఎంపిక చేసి తీసుకువస్తున్న. కస్టమర్లు కోరిన నమూనాలు అందిస్తున్న. పది మందికి కుట్టు శిక్షణ కూడా ఇస్తున్న. వ్యాపారంలో వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణకు సహకారం అందిస్తున్న.

– పద్మ, తానూరు

ప్రమిదలు తయారు చేస్తున్న

గ్రామంలోని స్వయం సహాయక సంఘం ద్వారా రుణం తీసుకుని మట్టి ప్రమిదలు తయారు చేస్తున్న. వాటిని స్వయం సహాయక సంఘాలు, మార్కెట్‌కు సరఫరా చేస్తూ లాభాలు పొందుతున్న. ఇప్పటికే డ్వాక్రా సంఘాలకు ఐదువేల ప్రమిదలు సరఫరా చేసేందుకు అధికారుల నుంచి ఆర్డర్ వచ్చింది. రుణం తీసుకుని కులవృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న.

– చంద్రబాయి, కోలూరు

ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న

సంఘంలో రుణం తీసుకుని ఆర్‌సీఎం హోల్‌సేల్ షాప్ ప్రారంభించిన. వ్యాపారంలో కొనసాగుతూ లాభాలు గడిస్తున్న. వ్యాపారంలో వచ్చిన ఆదాయాన్ని రుణ వాయిదాలు చెల్లించి మిగతా డబ్బులను కుటుంబ పోషణ కోసం ఖర్చు చేస్తున్న. కొంత మొత్తాన్ని పొదుపు కూడా చేస్తున్న. నా భర్తకు చేదోడువాదోడుగా ఉంటూ ఆర్థికాభివృద్ధి సాధించడం సంతోషంగా ఉంది.

– అంజనాబాయి, తానూరు

ఇంటి పనులు చేసుకుంటూనే..

డ్వాక్రా సంఘంలో తక్కువ వడ్డీకి రుణం తీసుకుని మార్కెట్‌లో బ్యూటీ పార్లర్, లేడీస్ టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మ్యాచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న. మా పిల్లలను పాఠశాలకు పంపించి ఇంటి పనులు ముగించుకుని వ్యాపారం చేస్తున్న. టైలరింగ్‌లో యువతకు శిక్షణ ఇస్తున్న. ఒక వ్యాపారం చేస్తున్నప్పుడే కొత్త ఆలోచనలకు అవకాశం కలుగుతుంది. సమాజంపై అవగాహన వస్తుంది.

– విజయలక్ష్మి, తానూరు

కిరాణా షాపు నిర్వహిస్తున్న



డ్వాక్రా సంఘం ద్వారా తక్కువ వడ్డీకి రుణం తీసుకున్న. గ్రామంలోనే కిరాణా షాపు ప్రారంభించిన. దుకాణం ద్వారా వచ్చిన ఆదాయంతో రుణ వాయిదాలు చెల్లిస్తున్న. మిగిలిన మొత్తం కుటుంబ పోషణ, పిల్లల చదువుకు ఖర్చు చేస్తున్న. రుణాలు సక్రమంగా చెల్లిస్తే అధికారులు మళ్లీ అడిగినంత రుణం ఇస్తున్నరు. సొంతంగా కిరాణా దుకాణంతో ఉపాధి పొందడం ఆనందంగా ఉంది.

– శోభ, కోలూరు

స్త్రీశక్తి ద్వారా రుణాలిస్తున్నాం



గ్రామాల్లో డ్వాక్రా సంఘాల మహిళలకు వ్యాపారం చేసుకోవడానికి స్త్రీశక్తి ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్నాం. స్వయం ఉపాధి వైపు వారిని ప్రోత్సహిస్తున్నాం. ఇప్పటికే తానూరు మండలంలో 725 మహిళా సంఘాలు కొనసాగుతున్నాయి. ఈ సంఘాలకు రూ.16కోట్ల రుణాలందించాం. రుణాలు పొందిన మహిళలు వ్యాపారాలు కొనసాగిస్తూ ఆర్థికాభివృద్ధి చెందుతున్నారు.

– సులోచనరెడ్డి, ఐకేపీ ఏపీఎం

అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న వెంకటేశ్వరస్వామి

మంచిర్యాలఅర్బన్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్–14, 17 బాలబాలికల అథ్లెటిక్ ఎంపిక పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కాసిపేట జెడ్పీహెచ్‌ఎస్ సహకారంతో మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 600మందికి పైగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వరస్వామి, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ యాకూబ్, పాఠశాల హెచ్‌ఎం సాంబమూర్తి, పర్యవేక్షకులు రేణి రాజయ్య, భూక్యా రాజన్న, పీడీ మారయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వాలీబాల్ ఎంపిక పోటీలు

ఈనెల 11న పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో లక్సెట్టిపేట జెడ్పీహెచ్‌ఎస్ (బాలికలు) పాఠశాలలో అండర్–17, 14 బాలికల జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి యాకూబ్ ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

ఐదుగురు ఉద్యోగులపై కేసు

మందమర్రిరూరల్: ఆగస్టు చివరి వారంలో మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో విధి నిర్వహణ విషయంలో ఇరువురు జాతీయ కార్మిక సంఘాల నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీనిపై ఓ సంఘం నాయకుడు మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వెంటనే విచారణ చేపట్టారు. కేసు నమోదు చేయకుండా పలుసార్లు రాజీ కోసం ప్రయత్నించగా ఫిర్యాదుదారు నిరాకరించారు. దీంతో ఉన్నతాధికారుల ప్రమేయం, కోర్టు ఆదేశాల మేరకు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఎస్సై రాజశేఖర్‌ను వివరణ కోరగా.. కోర్టు అనుమతితో గురువారం ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇది సింగరేణి చరిత్రలో మొదటి కేసుగా పలువురు పేర్కొంటున్నారు. విధి నిర్వహణలో ఉద్యోగులు మాటామాట అనుకుంటే గని ఉన్నతాధికారి వద్ద ఫిర్యాదు చేసుకుంటే సదరు అధికారి సర్ది చెప్పేవారు. లేదా నోటీసులివ్వడమో, సంజాయిషీ కోరడమో, రాజీ కుదర్చడమో జరిగేది. దీంతో గొడవలు సద్దుమణిగేవి. కానీ, కేకే ఓసీలో జరిగిన ఘటన కేసు వరకు రావడం అధికారుల నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పుస్తక రచనలో జిల్లా ఉపాధ్యాయులు



అందుబాటులోకి వచ్చిన తెలుగుఅకాడమీ పుస్తకం



నారాయణవర్మ, వందనకుమారి

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ తెలుగు అకాడమీ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగే పుస్తక ప్రచురణ సంస్థ. సంస్థ డీఎస్సీకి రూపొందించిన స్టడీ మెటీరియల్‌లో భౌతిక రసాయన శాస్త్రం కంటెంట్ పుస్తక రచనలో నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. కడెం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు పీ నారాయణవర్మ, తానూరు మండలం భోసి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు సీహెచ్ వందనకుమారి భాగస్వాములయ్యారు. గత జనవరిలో ఈ పుస్తకం తుదిరూపు దిద్దుకోగా తాజాగా ప్రచురితమై అందరికీ అందుబాటులోకి వచ్చింది. ఈ పుస్తకం డీఎస్సీ, టెట్ పరీక్షల కోసం తెలుగు మీడియం వారికి ప్రయోజనకారిగా ఉండనున్నట్లు పుస్తక రచయితలు తెలిపారు. వీరిరువురు 24 ఏళ్లుగా సైన్స్ ఫెయిర్, ప్రాజెక్ట్ పద్ధతుల ద్వారా విద్యార్థుల్లో సైన్స్‌పై జిజ్ఞాస పెంచడంలో సఫలీకృతులయ్యారు. పాఠ్యాంశాల బోధనలోనూ తమదైన ప్రత్యేక ముద్ర వేసుకున్నారు.

పేగు బంధానికి వీడ్కోలు

- కొడుకు చితికి నిప్పు పెట్టిన తల్లి



నరేశ్ (ఫైల్)



నరేశ్ అంతిమయాత్రలో తల్లి రాజమ్మ

తాండూర్: జీవిత చరమాంకంలో తనకు తలకొరివి పెట్టి నరకం నుంచి తప్పిస్తాడనుకున్న ఆ కొడుకుకు కన్న తల్లే తలకొరివి పెట్టింది. ఈ విషాద ఘటన మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. మాదారం టౌన్‌షిప్ గ్రామానికి చెందిన రిటైర్డ్ సింగరేణి కార్మికురాలు సలాకుల రాజమ్మకు రమేశ్, నరేశ్ ఇద్దరు కుమారులున్నారు. వీరిలో రమేశ్ ఏడాది క్రితమే అనారోగ్యంతో మరణించాడు. ఆ విషాదం నుంచి ఇంకా తేరుకోకముందే ఆ తల్లిని మరో చేదు వార్త వెంటాడింది. చిన్న కుమారుడు నరేశ్ కూడా ఫిట్స్‌తో గురువారం మృతి చెందాడు. దీంతో ఆమె అంతులేని శోకాన్ని అనుభవించాల్సిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం నరేశ్ అంత్యక్రియలు నిర్వహించగా తల్లి రాజమ్మే కుండపట్టి కొడుకును కాటివరకు సాగనంపింది. తీవ్ర దుఃఖాన్ని దిగమింగుతూ కొడుకు చితికి నిప్పంటించి పేగు బంధానికి కన్నీటి వీడ్కోలు పలికింది. రాజమ్మ రోధించిన తీరుకు పలువురు కంటతడి పెట్టుకున్నారు. నరేశ్‌కు భార్య, కుమార్తె ఉంది. ఏడాది వ్యవధిలోనే రాజమ్మ ఇద్దరు కుమారులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వెంకటకృష్ణ

రెబ్బెన: మండలంలోని రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ఖాళీ స్థలం వాగు ఒడ్డు వద్ద శుక్రవారం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కళాశాల సమీపాన ఉన్న అహ్మద్‌బిన్ మహ్మద్ ఖాళీ స్థలంలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వయస్సు 55–60 ఏళ్లు ఉంటుందని, 5.3 అడుగుల ఎత్తు, చామనచాయ రంగు ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి ఒంటిపై మెరూన్ రంగు డ్రాయర్, నీలి రంగు టీషర్టు ఉన్నట్లు తెలిపారు. భిక్షాటన చేస్తూ పరిసర ప్రాంతాల్లో తిరుగుతుంటాడని, శుక్రవారం తెల్లవారుజామున ఆకలితో మృతి చెంది ఉంటాడని ఎస్సై భావిస్తున్నారు. కాగా, మృతుడి సమాచారం తెలిసినవారు 8712670532 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఒకరిపై పోక్సో కేసు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని గాంధీనగర్‌కు చెందిన ఎర్రల వర్ధన్‌పై పోక్సో చట్టం కింద ఈ నెల 8న కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంతోష్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 7న వర్ధన్ ఓ బాలిక ఫొటోలను ఆమె సమ్మతి లేకుండా అతని సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈ విషయమై ఆమె ప్రశ్నించినందుకు బాలికతోపాటు ఆమె మేనమామను కూడా బెదరించాడు. తనను వెంబడిస్తూ ఫొటోలు పోస్టులు చేసి మానసికంగా వేధిస్తూ, తన ఇంటి వద్ద గొడవ చేసి తనను నెట్టేసిన వర్ధన్‌పై చర్య తీసుకోవాలని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌పై దాడి



ట్రాక్టర్ యజమానులు, అధికారుల మధ్య జరుగుతున్న వాగ్వాదం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని రాస్పెల్లి శివారు అటవీ భూమి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బాబు పాటేకర్, అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారు. వాటిని రాస్పెల్లి నుంచి కాగజ్‌నగర్ రేంజ్ కార్యాలయానికి తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్ యజమాని నాసిద్‌అలీ ఖాన్ అడ్డుకుని ఫారెస్ట్ అధికారులతో వాగ్వాదానికి దిగాడు. తాను పట్టా భూముల నుంచి మాత్రమే ఇసుక తరలిస్తున్నానని, అది అటవీ ప్రాంతం కాదని వాదించాడు. అయితే నాసిద్‌అలీ ఖాన్ తమ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు తనపై దాడి చేశారని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బాబుపాటేకర్ ఈజ్‌గాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నాసిత్‌అలీఖాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈజ్‌గాం ఎస్సై కల్యాణ్ తెలిపారు. పట్టుకున్న ఆరు ట్రాక్టర్లను రేంజ్ కార్యాలయానికి తరలించారు.

మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్య

నిర్మల్ రూరల్: మండలంలోని అనంతపేట గ్రామానికి చెందిన బొబ్బిలి నరేందర్ యాదవ్ (27) మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య పాల్పడ్డట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. నరేందర్ యాదవ్ కొంతకాలంగా మద్యానికి బానిసై తన భార్యను నిత్యం వేధించేవాడు. దీంతో ఆమె కొంతకాలం క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన నరేందర్ గురువారం సాయంత్రం గ్రామ శివారులో మద్యం మత్తులో పురుగుల మందు తాగి పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే జిల్లా కేంద్రంలోని ఏరియాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అన్నం పెట్టినోడికే కన్నం..

ఆదిలాబాద్‌టౌన్: అన్నం పెట్టినోడికే కన్నం పెట్టిన సామెత ఈ ఘటనకు అద్దం పడుతోంది. ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన జీ అశోక్ ఇంటి సమీపంలో అపరిచిత వ్యక్తి శుక్రవారం కూర్చొని ఉన్నాడు. అతడి వద్దకు వెళ్లిన అశోక్ ఇక్కడ ఏం చేస్తున్నావని అడగగా, తనకు ఆకలి అవుతోందని అన్నం పెట్టమని కోరాడు. దీంతో బాధితుడు తన ద్విచక్ర వాహనాన్ని నడపమని చెప్పి తాను వెనుక కూర్చున్నాడు. తెలంగాణ చౌక్ ప్రాంతంలో మద్యం తాగించి భోజనం చేయించాడు. ఈ క్రమంలో అశోక్ అక్కడే ఉండగా నిందితుడు బైక్ తీసుకుని పారిపోయాడు. సీసీ ఫుటేజీలో ఈ దృశ్యం రికార్డయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ వివరించారు.

ఆర్జీయూకేటీలో మానసిక ఆరోగ్య దినోత్సవం



కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, అధికారులు, విద్యార్థులు

బాసర: బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం మానసిక స్వస్థత కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని పెంచుకోవడానికి ఉదయం వ్యాయామం, ధ్యానం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శారీరక వ్యాయామాలు, ధ్యానం, మానసిక ఆరోగ్య అవగాహన కోసం క్యాంపస్‌లో ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, ఆర్జీయూకేటీ మానసిక స్వస్థత కేంద్రం సిబ్బంది, శారీరక విద్యావిభాగ సిబ్బంది పాల్గొన్నారు.

నెమలిని చంపిన నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్‌ఆర్వో

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామ సమీపంలోని చేనులో ముగ్గురు వ్యక్తులు జాతీయ పక్షి నెమలిని చంపారు. ఎఫ్‌ఆర్వో ప్రణయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గాదిగూడ మండలం ఖాండురాంపూర్ గ్రామానికి చెందిన బద్వాల్ గంగాసింగ్ బోథ్ మండలం పొచ్చెర గ్రామంలో పాలేరుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 9న చేనులో గడ్డి కోస్తూ ఉండగా గంగాసింగ్‌కు నాలుగు నెమలి గుడ్లు కనిపించాయి. దీంతో అక్కడికి నెమలి వస్తుందని గమనించాడు. పొచ్చెర గ్రామంలోనే వలస కూలీలుగా ఉన్న గాదిగూడ మండలం లోకారికి చెందిన దత్తు, ఇంద్రవెల్లి మండలం గోపాల్‌పూర్‌కు చెందిన బాలాజీతో కలిసి గురువారం రాత్రి గుడ్లపై పొదిగిన నెమలిని కర్రతో కొట్టి చంపాడు. నెమలి, గుడ్లను బైక్‌పై తీసుకెళ్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు వారి ద్విచక్రవాహనం ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద చని పోయిన నెమలి, గుడ్లు కనిపించగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై వన్య ప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్‌ఆర్వో తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న యువకుడి అరెస్ట్



జైపూర్: గంజాయి మొక్క, నిందితుడితో ఎస్సై



ఆసిఫాబాద్‌అర్బన్: పోలీసుల అదుపులో నిందితుడు

జైపూర్: గంజాయికి అలవాటు పడిన యువకుడు ఏకంగా ఇంటి సమీపంలోనే మొక్కలు పెంచుతుండడంతో పక్కా సమాచారం మేరకు పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామారావుపేట గ్రామానికి చెందిన బొద్దున సత్యనారాయణ అనే యువకుడు గంజాయికి అలవాటు పడ్డాడు. తన ఇంటి సమీపంలోనే గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీధర్, తన సిబ్బందితో వెళ్లి తనిఖీ చేశారు. సత్యనారాయణ ఇంటి ఆవరణలో పెంచుతున్న గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశారు. రిమాండ్‌కు తరలించి చెన్నూర్ కోర్టులో హాజరు పరిచారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, సాగు చేసినా కఠినచర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

తిర్యాణి మండలంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: తిర్యాణి మండల పరిధిలోని చెలిమెల గ్రామం కొద్దుగూడ శివారులో ఆత్రం పాపారావ్ (32) తన కంది చేనులో గంజాయి సాగు చేస్తుండగా అతడిపై కేసు నమోదు చేసినట్లు తిర్యాణి ఎస్సై వెంకటేశ్ తెలిపారు. 10గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వాంకిడి: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర, ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం మండలంలోని జాతీయ రహదారిపై ఖమాన ఎక్స్ రోడ్ సమీపంలో చోటు చేసుకుంది. ప్రమాదంలో ఖమాన గ్రామానికి చెందిన విలాస్, భూమయ్య, ఉత్తరప్రదేశ్‌కు చెందిన లలిత్ గాయాలపాలయ్యారు. వారిని చికిత్స కోసం నేషనల్ హైవేకు చెందిన అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రమాదానికి సంబంధించిన వివరాల కోసం ఎస్సై మహేందర్‌ను సంప్రదించగా బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు.